

### యార్డు దశ మారేనా?

కొడంగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు మూడు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. 8లో▸




### రెవె'న్యూ' సేవలు

ప్రజలకు మెరుగైన, సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేసింది. 8లో▸



### ఆలయాల అభివృద్ధికి కృషి

రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### కొడంగల్‌లో ఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



కవాతులో ఆర్‌పీఎఫ్ బలగాలు

**కొడంగల్:** పట్టణంలోని పలు కాలనీల్లో ఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. 99 బెటాలియన్ హకీంపేటకు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు జవానులు కొడంగల్ పుర వీధుల గుండా తిరిగారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించడం వల్ల ప్రజల్లో భరోసా కల్పించడం కోసం కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డు మీదుగా వినాయక చౌరస్తా, సంత బజార్, బ్రాహ్మనవాడ, తెలుగుగేరి, బాలాజీ నగర్ మీదుగా కవాతు సాగింది.

### ప్రజలతో మమేకం కండి

ఎస్పీ నారాయణరెడ్డి



మైపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

**అనంతగిరి:** ప్రజలతో మమేకమై పనిచేస్తే మంచి పేరు వస్తుందని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో తాండూరు పీఎస్‌లో ఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న మైపాల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల పాటు పోలీసు ఉద్యోగం చేయడమంటే చాలా గొప్ప విషయమన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారిగా మైపాల్‌రెడ్డి మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రజలకు మనం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లా పోలీసు ప్రెసిడెంట్ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### హారికకు ప్రావీణ్య పురస్కార్ అవార్డు




అవార్డు అందుకుంటున్న హారిక

**కొడంగల్:** పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థిని హారికకు రాష్ట్ర స్థాయిలో ప్రావీణ్య పురస్కార్ అవార్డు వరించింది. జాతీయ సెమ్స్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో మార్చి నెలలో జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో హారిక రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో సెమ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ రాంచందర్‌రెడ్డి, ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి హారికకు అవార్డు, మెమొంటో, మెడల్ అందజేశారు. శాలువా కప్పి అభినందించారు. నవీన ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్ రాజ్‌ను విశేష పురస్కార్ అవార్డుతో సన్మానం చేశారు.

### యాదవులపై దాడులను ఆపాలి

బీసీ సంఘం జాతీయ కార్యదర్శి బీరయ్య యాదవ్



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

**మోమిన్‌పేట:** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో యాదవులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంఘం జాతీయ కార్యదర్శి బీరయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, యాదగిరి యదవ్, మానయ్య, అంజయ్య, బిచ్చయ్య, అంజి, పాపయ్య, శ్రీను పాల్గొన్నారు.

# సర్కారు బడికి రాంరాం!

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాలకార్మికులను స్కూళ్లలో చేర్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఇవేవీ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కలసిరావడం లేదు. ఎప్పటి లాగే ఈసారి కూడా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది.

## ఏటా తగ్గుతున్న విద్యార్థుల నమోదు




- నాలుగేళ్లలో 40శాతం కిందకు..
- ప్రభావం చూపుతున్న పది ఫలితాలు
- ప్రైవేటుకే మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు

**వికారాబాద్:** ప్రభుత్వ పాఠశాలలపై చాలామంది తల్లిదండ్రులకు నమ్మకం కుదరడం లేదు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నా..ఫీజుల బాధ లేకున్నా.. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నా చాలా మంది ప్రైవేటుకే మొగ్గుచూపుతున్నారు. గడిచిన పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులతో ప్రభుత్వ బడులకు ప్రైవేటు స్కూళ్లు సమాంతర వ్యవస్థగా తయారయ్యాయి. గతంలో పట్టణ ప్రాంత వాసులు మాత్రమే వారి పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్చేవారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ప్రైవేటు బాట పట్టారు. ఇది సర్కారు బడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య 40శాతం మేర తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి.జిల్లాలో 1,063ప్రభుత్వ బడులు ఉండగా 84,208 మంది విద్యార్థులు ఉన్నారు.185 ప్రైవేటు పాఠశాలల్లో 45,042 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సర్కారు బడులకు గడ్డు కాలమేనని విద్యా వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బడికి పంపడంలోనూ వివక్ష**

పురుషాధిక్య సమాజంలో అనేక రూపాల్లో లింగవివక్ష అనాదిగా కొనసాగుతూ వస్తున్న విషయం తెలిసిందే.. బాల్య వివాహాలు, ఇంట్లో పనులు చేసే విషయంలో, పునర్వివాహాల్లో లింగవివక్ష కొట్టొచ్చినట్లు కనిపించేది. గతంలో మగపిల్లలను బడులకు పంపి ఆడపిల్లలకు చదువెందుకులే అంటూ చిన్న చూపు చూసేవారు. భ్రూణహత్యల్లోనూ లింగవివక్ష కనిపించేది. తాజాగా చిన్నారులను బడులకు పంపించే విషయంలోనూ లింగవివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణాల్లో బాల బాలికలిద్దరినీ వారి ఆర్థిక స్తోమతను బట్టి ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వివక్ష కనిపిస్తోంది. ఇంట్లో ఒక ఆడపిల్ల ఒక మగ పిల్లాడు ఉంటే వారిలో కుమారుడిని ప్రైవేటుకు కుమార్తెను ప్రభుత్వ బడికి పంపుతున్నారనే వాదన వినిపిస్తోంది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు జరిపిన సర్వేల్లో కూడా ఈ విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బడులలో నమోదవుతున్న బాల బాలికల నిష్పత్తి గమనిస్తే కూడా ఈ విషయం నిజమనే అనిపిస్తుంది. ప్రైవేటులో విద్యార్థుల సంఖ్య 24,773 ఉండగా బాలికలు 20,269 మంది ఉన్నారు. అంటే బాలికల కంటే బాలురు సంఖ్య 4,504 మంది ఎక్కువ. అదే ప్రభుత్వ బడులలో బాలుర సంఖ్య 41,285 ఉండగా.. బాలికలు 42,923 మంది ఉన్నారు. అంటే బాలుర కంటే బాలికలు 1,638 మంది అధికంగా నమోదయ్యారు.

**గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు సంఖ్య ఇలా..**

| విద్యా సంవత్సరం | చేరిన విద్యార్థులు |
|---|---|
| 2022 - 23 | 9,085 |
| 2023 - 24 | 7,784 |
| 2024 - 25 | 7,078 |
| 2025 - 26 | 6,124 |

**నమోదుపై పది ఫలితాల ప్రభావం**

పదో తరగతి ఫలితాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రభావం చూపుతున్నాయి. పది ఫలితాల్లో జిల్లా ప్రతిసారీ చివరి స్థానంలో నిలుస్తోంది. దీంతో తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడిలో చేర్చేందుకు జంకుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పదేళ్ల క్రితం ప్రభుత్వ బడులల్లో ఒకటవ తరగతిలో 9,500 మంది విద్యార్థులు నమోదు కాగా ఈ ఏడాది 6,124 మందితో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ప్రైవేటు స్కూళ్లలో మాత్రం 2,640 మంది నుంచి 7,522 మందికి చేరడం సర్కారు బడుల పనితీరుకు అద్దం పడుతోంది.

**పిల్లల సంఖ్య పెంచేందుకు కృషి**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం. పదో తరగతి ఫలితాల్లో వెనుకబడటానికి గల కారణాలను అన్వేషిస్తున్నాం. రెండేళ్ల క్రితం 65శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత కాగా గత ఏడాది 73.97 శాతంతో కాస్త మెరుగైన ఫలితాలు సాధించాం. ఈ సారి వంద సాతం ఫలితాల కోసం కృషి చేస్తున్నాం. ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాం.

– జి.రేణుకాదేవి, డీఈఓ



అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న అధికారులు

## అటవీ భూమి కబ్జాకు యత్నం

- అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
- పరారీలో నిందితులు
- కేసు నమోదు

**బషీరాబాద్:** మండలంలోని మైల్వార్ రిజర్వ్‌డ్ ఫారెస్టులో ఆక్రమణలు ఆగడం లేదు. తాజాగా మైల్వార్ తండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మూడు రోజులుగా సర్వే నంబర్ 218లో రెండు ఎకరాల అటవీ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించారు. సుమారు 50 వరకు చెట్లను నరికి ట్రాక్టర్‌తో చదును చేశారు. విషయం తెలుసుకున్న అటవీ సెక్షన్ అధికారులు స్నేహశ్రీ, ఫీర్యానాయక్, మమత, బీట్ అధికారి మల్లప్ప అక్కడికి చేరుకున్నారు. అధికారుల రాకను గుర్తించిన కబ్జాదారులు, ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యారు. తండాకు చెందిన గోపాల్ రాథోడ్, రతన్ రాథోడ్ అటవీ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. భూమిని చదును చేసేందుకు మైల్వార్‌కు చెందిన షఫీ ట్రాక్టర్‌ను వినియోగించినట్లు తేల్చారు. వాహనాన్ని సీజ్ చేయడానికి వెళితే అప్పటికే దాన్ని రహస్య ప్రాంతానికి తరలించి సదరు యజమాని పరారైనట్లు అధికారులు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి స్నేహశ్రీ తెలిపారు. అటవీ ప్రాంతంలో చెట్లను నరికినా, భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**అనంతగిరి:** అంధుల ఆశ్రమ పాఠశాలలో అర్హులైన విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మహబూబ్‌నగర్ ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని రాష్ట్ర స్థాయి అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు ఉండి 40 శాతం అంధత్వం కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, దుస్తులు అందిస్తామని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించి మహబూబ్‌నగర్ పిల్లలమర్రి రోడ్డులోని పాఠశాలలో సంప్రదించాలన్నారు. వివరాల కోసం సెల్ నంబరు 9618243794లో సంప్రదించాలని కోరారు.

## రేషన్ బియ్యం పంపిణీ గడువు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్



**బంట్వారం:** ప్రస్తుతం మూడు నెలల బియ్యం పంపిణీ ఒకే సారి ఇస్తున్నందున గడువును మరో 15రోజుల పాటు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. పౌరసరఫరాల శాఖ విధించిన గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందని ఈ క్రమంలో చాలామంది లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకోలేకపోయారని అన్నారు. మూడు నెలల రేషన్ కోటా ఒకే సారి ఇస్తుండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి రేషన్ ఇవ్వాలంటే 20 నిమిషాలకు పైగా సమయం పడుతోందన్నారు. త్వరగా వేలిముద్రలు రాకపోవడం, ఇతర కారణాలతో అర్హులందరూ రేషన్ తీసుకోలేకపోయారని ఆయన తెలిపారు. మరింత గడువు పెంచాలని డిమాండ్ చేశారు.. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



విద్యార్థుల ఎంపిక కోసం డ్రా తీయిస్తున్న అధికారులు

## 'బెస్ట్ అవైలబుల్'కు విద్యార్థుల ఎంపిక

**అనంతగిరి:** షెడ్యూల్ కులాల, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల ఎంపిక కోసం డ్రా తీశారు. గిరిజన సంక్షేమ శాఖలో 3, 5, 8వ తరగతులకు 22 మందిని తల్లిదండ్రుల సమక్షంలో ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. షెడ్యూల్ కులాల విభాగంలో ఒకటవ తరగతిలో 88 ఖాళీలకు గాను 139 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రూపుల వారీగా సీట్ల కేటాయింపు జరిగిందని వివరించారు. గ్రూప్ వన్‌లో 6 సీట్ల గాను ఇద్దరు, గ్రూప్ 2లో 53 సీట్లకు గాను 87 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. గ్రూప్ 3లో 29 సీట్లకు గాను 50 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఒకటవ తరగతిలో 88 సీట్లకు గాను 84 మంది విద్యార్థులు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. 5వ తరగతిలో 91 సీట్లకు గాను 17 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారందరినీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. డ్రా పద్ధతిలో ఎంపికైన విద్యార్థులకు జూలై 3న పత్రాలను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, సహాయ సంక్షేమ అధికారులు శుక్రవర్ధన్ రెడ్డి, వీరానందం, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పూడూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచి సత్తా చాటాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు సూచించారు. శనివారం మండలంలోని మన్నెగూడలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కలసికట్టుగా పని చేసి పార్టీ నాయకులను గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు మెజార్టీ సీట్లు కైవసం చేసుకోవాలని సూచించారు. మండల కార్యవర్గంలో ఖాళీగా ఉన్న పదవులను వారంలోగా భర్తీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, అజీం పటేల్, శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

**త్వరలో అన్ని కమిటీలు వేస్తాం**

**కుల్కచర్ల:** త్వరలో అర్హులైన వారికి పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు అందుతాయని, ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో గ్రామ, మండల కమిటీ, జిల్లా కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పార్టీకోసం కష్టపడే వారికి చోటు లభిస్తుందని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకులు నరేందర్, వినోద్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి నర్సింలు యాదవ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- వాణిజ్య రైతులు దృష్టిసారించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- దేవునిఎర్రవల్లిలో ఆయిల్‌పామ్ సాగు ప్లాంటేషన్



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న మంత్రి తుమ్మల, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

**చేవెళ్ల:** ఉద్యాన పంటలు, డెయిరీల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లిలో శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి పొలంలో 21 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఉద్యానశాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ డిమాండ్‌కు తగిన విధంగా రైతులు ముందుకురావాలన్నారు. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు పండకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు తెలుగు రాష్ట్రాల భూములు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. దేశానికి సరిపడా కావాలంటే 70లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణలో జిల్లాకో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటే లక్ష్యమని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతుభరోసా నిధులు విడుదల చేశామని వెల్లడించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ డ్రిప్ పరికరాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో శనివారం ఒక్కరోజే 557 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. 5వేల ఎకరాల్లో పంట సాగుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ముప్పై ఏళ్ల పాటు ఆదాయం**

హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరానికి 52 వేల సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఒక్కసారి సాగు చేస్తే ముప్పై ఏళ్ల పాటు ఆదాయం వస్తుందన్నారు. ఇది రైతులకు ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి కార్యక్రమమని స్పష్టంచేశారు.

**ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి**

జిల్లాతోపాటు చేవెళ్ల నియోజకవర్గంలోని రైతులు ఎక్కువగా ఆయిల్‌పామ్‌సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేలా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో లేదా అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలన్నారు.

**డ్రోన్ ఇప్పించండి**

సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి స్ఫూర్తితోనే ఆయిల్‌పామ్‌సాగుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. తమ గ్రామంలోని రైతు సంఘానికి ఓ డ్రోన్ ఇప్పించాలని, చేవెళ్లలో డివిజన్ వ్యవసాయ, ఉద్యాన కార్యాలయలకు భవనాలు కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గింజ్డంగుల సంస్థల చైర్మన్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చంద్రకళ, జేడీఏ నర్సింహ్మారావు, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మానిక్యరెడ్డి, మధుసూదన్‌గుప్తా, ఆగిరెడ్డి, వసంతం, దర్శన్, కాలె శ్రీకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మహేందర్‌రెడ్డి

బంట్వారం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ గ్రామంలో చోటు చేసుకుంది. కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ తెలిపిన వివరాల ప్రకారం.. పట్లోల్ల మహేందర్‌రెడ్డి (57) తన పొలం చుట్టూ సోలార్ వైర్ వేసుకున్నాడు. ఎప్పటిలాగే ఉదయం వేళ పొలం పనులకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగ తెగిపడి సోలార్ వైర్‌పై పడి ఉంది. ఈ విషయాన్ని గమనించకుండా వెళ్లిన మహేందర్‌రెడ్డి సోలార్ వైర్‌కు కాలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని ఎస్‌ఐ శైలజ తెలిపారు.

### ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి



శేఖర్(ఫైల్)

కొడంగల్ రూరల్: ట్రాక్టర్ ట్రాలీ ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రావులపల్లి సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అప్పాయిపల్లికి చెందిన శేఖర్(30) రావులపల్లిలోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం అప్పాయిపల్లి నుంచి విధులకు బయల్దేరాడు. ఈ క్రమంలో రావులపల్లి సమీపంలో ముందు వెళ్తున్న ఓ ట్రాక్టర్ టైర్ అకస్మాత్తుగా పేలడంతో ట్రాలీ పక్కకు తిరిగి వెనక ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ కిందపడడంతో తీవ్రగాలయ్యాయి. ఇది గమనించిన పలువురు 108లో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా శేఖర్ మృతిచెందాడు. మృతదేహాన్ని కొడంగల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. శేఖర్ భార్య అంబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జీవీ సత్యానారాయణ తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పహాడీషరీఫ్‌కు చెందిన హబీబుల్లాఖాన్ కుమారుడు రహ్మతుల్లాఖాన్(40) తాగుడకు బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు 2024 జనవరిలో బాలాపూర్ మెట్రో సిటీలోని మా హెల్ప్ డిటెక్షన్ సెంటర్‌లో చేర్పించారు. ఆరు నెలల పాటు చికిత్స పొందిన అనంతరం రహ్మతుల్లా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో సోదరుడు అంజదుల్లాఖాన్ శుక్రవారం రాత్రి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పీఎస్‌లో లేదా 87126 62366 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### వ్యక్తి బలవన్మరణం

మాడ్గుల: చికెన్ తీసుకుని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నర్సాయిపల్లిలో చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కడారి అంజన్‌కుమార్(36) శుక్రవారం సాయంత్రం చికెన్ తీసుకువస్తానని చెప్పి వేయిరూపాయలు తీసుకుని కొలుకులపల్లికి వెళ్లాడు. రాత్రైనా రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. శనివారం గ్రామ శివారులోని గుట్టమీద రేల చెట్టుకు పంచతో ఉరేసుకున్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడికి భార్య అలివేలు, ఓ కూతురు ఉన్నారు. అంజన్‌కుమార్ తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.3 కోట్లతో మౌలిక వసతులను కల్పించేందుకు విర్టుసా మల్టీ నేషనల్ కంపెనీ ముందుకు వచ్చింది. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం పూజ చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ లెవెల్లింగ్, భవనం మొత్తాకి ఐరన్ గ్రిల్స్, పెయింటింగ్ మొదటి విడదతలో చేపట్టింది. ఈ మొత్తం పని జరిగితే కార్పొరేట్ పాఠశాల భవనం మాదిరిగా ఉంటుంది.



# రెవె'న్యూ' సేవలు

**అమలులోకి వచ్చిన నూతన సేవలు**

- మీసేవ కేంద్రాల్లో అందుబాటులోకి..
- దరఖాస్తు చేసిన వెంటనే కులం, ఆదాయ ధ్రువపత్రాలు
- ఇక నుంచి ఇంటి వద్దకే ఇసుక
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

| | |
|---|---|
| జిల్లాలోని మున్సిపాలిటీలు | - 4 |
| మొత్తం మండలాలు | - 32 |
| మీసేవా కేంద్రాలు | - 84 |

బొంరాస్‌పేట: ప్రజలకు మెరుగైన, సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేసింది. మీసేవ కేంద్రాల ద్వారా కులం, ఆదాయం, మార్కెట్ వ్యాల్యూ ధ్రువీకరణ పత్రాలు మరింత సులువుగా అందించే కొత్త వెసులుబాటు అమలులోకి వచ్చింది. మీసేవలో దరఖాస్తు చేసుకుంటే చాలు ఇంటి వద్దకే ఇసుక వచ్చే అవకాశం ఏర్పడింది. ఈ అవకాశాలు ఈ నెల 27 నుంచి అమలులోకి వచ్చాయి. దీంతో అర్జీదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సత్వర సేవలు**

రెండు రోజుల క్రితం వరకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే నిర్దిష్ట సమయం 30రోజులు పట్టేది. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. పత్రాలు సకాలంలో అందక సామాన్యులు కొన్ని పథకాలకు దూరమయ్యే వారు. విద్యార్థులు ప్రవేశాలు పొందక, యువత ఉద్యోగాలు చేజార్చుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. అలాంటి ఇబ్బందులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీసేవల్లో ఈ కొత్త విధానం అమలులోకి తెచ్చింది. ఇప్పటి నుంచి నిమిషంలోనే కుల ధ్రువీకరణ పత్రం అందనుంది. అందుకోసం అర్జీదారులు సమీపంలోని మీసేవ కేంద్రంలో తమ పాత పత్రం నంబరు లేదా ఆధార్‌కార్డు నంబరు చెప్పాలి. ఓటీపీ నంబరుతో వెంటనే ధ్రువీకరణ పత్రం అందుతుంది.

**వాల్యూ సర్టిఫికెట్లు కూడా..**

అలాగే రిజిస్ట్రేషన్ శాఖ అందించే మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికెట్లు సైతం ఈ విధానంతోనే అందే వెసులుబాటు కల్పించింది. ఇదివరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండేది. కొత్త విధానం అమలులోకి రావడంతో ఇక నుంచి రాష్ట్రంలో ఎక్కడినుంచైనా మీసేవ కేంద్రాల్లో పొందే అవకాశం లభించనుంది.

**ఇంటి వద్దకే ఇసుక**

ఇసుక అవసరమైన వారు సమీపంలోని మీసేవలో బుక్‌చేస్తే చాలు కావాల్సినంత ఇసుక అధికారికంగా ఇంటి వద్దకే వస్తుంది. మీసేవ కేంద్రంలో తమ మొబైల్ నంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి. ఇసుక రవాణా చేసే వాహనం రకం, వాహనం నంబరు, ఇసుక పరిమాణం, ఎక్కడికి కావాలో, ఏ తేదీన కావాలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ఆన్‌లైన్ వివరాల నమోదు, రుసుం చెల్లింపులు అనంతరం ఇంటికి వద్దకే ఇసుక అందించే అధికారిక ప్రక్రియ కల్పించారు. తహసీల్దారు ధ్రువీకరణతో అర్జీదారుల ఇళ్ల వద్దకు సులభంగా ఇసుక అందుతుంది. అక్రమాలకు అడ్డుకట్టవేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొత్త విధానం అమలులోకి తెచ్చినట్లు తెలిసింది.

**ఫుల్ హ్యాపీ**



కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన ప్రతిసారీ చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేంది. సకాలంలో పత్రాలు రాక అవకాశాలను కోల్పోవాల్సి వచ్చేంది. కొత్తగా అమలులోకి వచ్చిన రెవెన్యూ సేవలు చాలా బాగున్నాయి. ఈ విధానంతో ఒక గంటలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందుకున్నా.

– గండ్వీడ్ సిద్ధార్థగౌడ్, బీటెక్ విద్యార్థి, బొంరాస్‌పేట

**ఆధార్ నంబరుతో..**



కులం, ఆదాయానికి సంబంధించిన పాత పత్రాలు లేకున్నా కేవలం ఆధార్ నంబరుతో ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. పట్టాదారు పాసుపుస్తకం ద్వారా మార్కెట్ వ్యాల్యూను పత్రం వెంటనే పొందవచ్చు. ఇసుక కూడా సులభంగా పెందే అవకాశం ఉంది.

– ఖాజాపాషా, మీసేవా ఫెడరేషన్ ఈసీ మెంబర్, బొంరాస్‌పేట

**సద్వినియోగం చేసుకోవాలి**



ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన రెవెన్యూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కొత్త సేవలతో ధ్రువ పత్రాలు వెంటనే పొందే అవకాశం ఉంది. ఇది విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరం. మీసేవ కేంద్రాల్లో ధ్రువపత్రాలు పొందవచ్చు.

– పద్మావతి, తహసీల్దార్, బొంరాస్‌పేట

# కర్షకలోకం పొలంబాట



పంటలో కలుపు తీస్తున్న మహిళా కూలీలు

బషీరాబాద్: ఖరీఫ్ సీజన్ కావడంతో పల్లెల్లో కర్షకులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. సూర్యోదయంతో పొలం బాటపడుతున్నారు. నాలుగైదు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పంటలకు జీవం పోసినట్లయింది. బషీరాబాద్ మండలంలో సుమారు పది వేల ఎకరాలకు పైగా కంది, పత్తి, పెసర, మినుము పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో మే చివరి వారం నుంచే విత్తనాలు వేశారు. అయితే విత్తిన తర్వాత వారం పదిరోజులు వర్షాలు కురవక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఎట్టకేలకు వర్షాలు కురుస్తుండటంతో పంటలకు జీవం పోసినట్లయింది.

**పగటిపూట పల్లెలు ఖాళీ..**

రైతులు, రైతు కూలీలు కలుపుతీత, విత్తనాలు వేయడం వంటి పనులు ముమ్మరంగా చేస్తున్నారు. దీంతో పగటి పూట జనాలు లేక గ్రామాలు బోసిపోతున్నాయి. మండలంలోని కాశీంపూర్, మంతట్టి, రెడ్డిఘనాపూర్, గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్, నవల్గా, జీవన్గీ, క్యాద్గిరా, గంగ్వార్, ఇందర్‌చెడ్, నావంద్గి, ఎక్మాయి, మర్పల్లి, పర్వత్‌పల్లి, దామర్‌చెడ్ గ్రామాల్లో సాగు చేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పంట సాల్ల నడుమ దంతె, గుంటుక తోలుతున్నారు. ఇందర్‌చెడ్, దామర్‌చెడ్, నీళ్లపల్లి, రెడ్డిఘణాపూర్, ఇస్మాయిల్‌పూర్ గ్రామాల్లో పెసర పంట జోరుగా సాగవుతోంది.

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

అనంతగిరి: వీడీడీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించేందుకు, కార్యాచరణ రూపొందించేందుకు గాను రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు పట్టణంలోని సంకల్ప్ స్కూల్‌లో సమావేశం ఉంటుందన్నారు. కావున జిల్లాస్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయులు, అధ్యాపక, న్యాయవాద, మేధావి, మహిళ, రైతు, వ్యాపార, వాణిజ్య, స్వచ్ఛంద, యువజన, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### యువతి అదృశ్యం



సురేఖ వెంకటదుర్గ(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జయరాం కుటుంబం తుక్కుగూడలోని నార్త్ స్టార్ ఎర్‌పోర్ట్ బాలియార్డ్ విల్లాలో నివాసం ఉంటోంది. ఈయన కుమార్తె సురేఖ వెంకట దుర్గ(24) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 23వ తేదీన కుటుంబ సభ్యులు నిద్రలేచి చూసేసరికి వెంకట దుర్గ కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా లాభం లేకుండా పోయింది. శివ అనే యువకుడిపై అనుమానం ఉందని తల్లి దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

# దేశ రక్షణలో యువత కీలకం

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**



రాజాసింగ్‌ను సన్మానిస్తున్న స్వామిజీలు

మొయినాబాద్ రూరల్: దేశ రక్షణలో యువత కీలకమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఇన్వెస్టించర్ కార్యక్రమ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే దేశభక్తితో పాటు రాజకీయాలపై మక్కువ పెంచుకోవాలన్నారు. దేశ భద్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధాన స్వామీజీ సుక్‌వల్లభ్, ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోర్టు కాంప్లెక్స్ సందర్శన



ఇబ్రహీంపట్నంలోని కోర్టు కాంప్లెక్స్‌ను సందర్శించిన జిల్లా జడ్జి కర్ణకుమార్



ఇబ్రహీంపట్నం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి కర్ణకుమార్

- కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్
- బార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

ఇబ్రహీంపట్నం: జిల్లా ప్రధాన న్యాయయూర్తి కర్ణకుమార్ శనివారం ఇబ్రహీంపట్నం కోర్టు కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఇక్కడ కొనసాగుతున్న 15వ అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్, జూనియర్ కోర్టులను పరిశీలించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదనంగా కోర్టు బిల్డింగ్, క్యాంటిన్, ఫ్యామిలీ కోర్టు తదితర అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలను పంపిస్తే.. తాను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతమయ్యేలా చూస్తానని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ శ్రీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అరిగే శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులు భాస్కర్, సహాయ కార్యదర్శి కృష్ణ, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్‌ను ఘనంగా సన్మానించారు.

# పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

**ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



దోమలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి: పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తిస్తుందని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారు పార్టీలో పదవుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీచేసే వారే ఎక్కువ సీట్లు గెలుచుకోవాలని సూచించారు. పార్టీ ఎవరికీ టికెట్ కేటాయించిన గెలిపించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అందిస్తున్న సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలు అందజేశామని అందరితో మాట్లాడి పార్టీ అభ్యర్థులు గెలిచేల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌రెడ్డి, కో ఆబ్జర్వర్ నరేందర్, బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు అశోక్, ఆంజనేయులు, తౌరియా, అయూబ్, ఆనంద్, నాగవర్ధన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం...**

దోమ: కాంగ్రెస్ బలోపేతం చేయడమే లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా రాష్ట్ర నాయకత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతుందన్నారు. రానున్నరోజుల్లో కార్యకర్తలు కష్టపడి పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, శాంతకుమార్, బద్రి, డీసీసీ ఉపాధ్యక్షుడు రాములు, జాకటి వెంకటయ్య, శివకుమార్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, బంగ్ల యాదయ్య, అంతిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ గౌడ్, బాల్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్: ఇద్దరు వ్యక్తుల నుంచి అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన కొడంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాండూరుకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల్ బీదర్‌లోని ఇరానీగల్లిలో అరకిలో గంజాయిని కొనుగోలు చేశారు. దీన్ని తీసుకొని బుల్లెట్ బండిపై కొడంగల్‌లో విక్రయించడానికి వస్తుండగా పట్టణ శివారులో పోలీసులు పట్టుకున్నారు. విచారణ అనంతరం వారిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలకు దారి మూసేయడం తగదు



మల్లన్న స్వామి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సబితారెడ్డి

**ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి**

పహాడీషరీఫ్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నగర శివారులోని విలువైన ప్రభుత్వ భూములను విక్రయించడమే పనిగా పెట్టుకుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. శనివారం ఆమె గ్రామస్తులతో కలిసి హౌజింగ్ బోర్డు అధికారులు ప్రీ కాస్ట్ గోడలను నిర్మిస్తున్న మామిడిపల్లిలోని దొంతరాల గుట్టపై ఉన్న మల్లన్న స్వామి, ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయానికి వెళ్లకుండా అధికారులు ప్రహరీ నిర్మిస్తున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ఎక్కడ ప్రభుత్వ భూములున్నాయో గుర్తించి, వాటిని అమ్మడమే ఎజెండాగా పెట్టుకుందన్నారు. హెచ్‌సీయూ భూముల విక్రయం వెలుగులోకి వచ్చి ఆగిపోవడంతో, చివరకు ఆ భూములను తాకట్టు పెట్టి బ్యాంక్‌లలో రూ.10 వేల కోట్లు రుణం తీసుకొచ్చిందన్నారు. ఇతర ప్రాంతాలలోని భూములను కూడా విక్రయించడంలో భాగంగానే రావిరాలలోని భూముల వద్దకు రావడంతో అడ్డుకున్నామన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణ సమయంలో మామిడిపల్లి రైతులు పెద్ద ఎత్తున పొలాలు ఇచ్చారన్నారు. ఇందులోని 50 ఎకరాలను ప్రభుత్వం హౌజింగ్ బోర్డుకు కేటాయించిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వనందున, హౌజింగ్ బోర్డు అధికారులు స్థలాన్ని ఆధీనంలోకి తీసుకునే సమయంలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అప్పట్లోనే కోరామని గుర్తు చేశారు. విమానాశ్రయం నిర్మాణానికి ముందే ఇక్కడ ఆలయాన్ని నిర్మించుకున్నారని, ప్రస్తుతం ఆలయానికి కూడా వెళ్లకుండా అధికారులు ప్రీ కాస్ట్ వాల్ నిర్మించడం సరికాదన్నారు. దేవాలయం జోలికి రావద్దని అధికారులకు సూచించారు. రావిరాల జొన్నాయిగూడలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి గతంలో 30 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం అవసరం లేనప్పటికీ, పాత రోడ్డును వదిలేసి ఆలయ భూముల్లో నుంచి కొత్త రోడ్డు వేస్తున్నారన్నారు. అనంతరం ఆమె హౌజింగ్ బోర్డు అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పవన్ కుమార్ యాదవ్, శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు నరేష్ యాదవ్, గోపాల్ యాదవ్, బాలరాజు యాదవ్, గ్రామస్తులు నందీశ్వర్, దశరథ, శ్రీనివాస్ రెడ్డి, రంగనాథ్, మహేందర్ యాదవ్, శంకర్ యాదవ్, చంద్రయ్య యాదవ్, ఎల్.శ్రీనివాస్, ఎస్.యాదగిరి, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు దశ మారేనా?

**మూడు దశాబ్దాలుగా నిరుపయోగం**

- క్రయవిక్రయాలు లేక వెలవెల
- పట్టించుకోని అధికార యంత్రాంగం




కొడంగల్‌లోని మార్కెట్ యార్డు కార్యాలయం

కొడంగల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పడి సుమారు మూడు దశాబ్దాలు కావస్తోంది. నాటి నుంచి నేటి వరకు అందులో క్రయ విక్రయాలు జరగ లేదు. యార్డులోని దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. అయినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతం నుంచి నిర్లక్ష్యానికి గురైన కొడంగల్ మార్కెట్ యార్డు దశ ఇప్పుడైనా మారుతుందేమోనని రైతులు, వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. 1994న అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కొడంగల్ ఉప మార్కెట్ యార్డుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత రైతులకు యార్డును అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో శ్రీకారం చుట్టారు. అయితే కొంతకాలం సజావుగా సాగిన క్రయవిక్రయాలు కొద్ది నెలలకే ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యాపారం జరగడం లేదు. యార్డు ఏర్పడి 30 ఏళ్లు దాటినా అధికారులు పట్టించుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మార్కెట్ యార్డుకు మహర్దశ వస్తుందని రైతులు భావించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి.

**40 వేల హెక్టార్లలో సాగు**

కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్ మండలాల్లో సుమారు 40 వేల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. కంది, పత్తి, పెసర, మినుము, వరి, జొన్న వంటి పంటలు వేస్తారు. మార్కెట్ యార్డ్ అందుబాటులో లేకపోవడంతో పంట దిగుబడిని దళారులకు విక్రయించి రైతులు మోసపోతున్నారు. ధరలోనూ తూకంలోనూ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసస్తున్నారు. సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడం వల్ల ఆరుగాలం కష్టించి పండిన పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో కంది పంట ఎక్కువగా పండుతోంది. ఇక్కడ పండించిన కందులకు తాండూరు, కర్నూల్, మహారాష్ట్రల్లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభిస్తే మేలు జరుగుతుందని ఈ ప్రాంత రైతులు భావిస్తున్నారు.

**రూ.3 కోట్లతో గోదాం నిర్మాణం**

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో భారీ గోదాం నిర్మించారు. ఈ గోదాంలో 5వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం దీనన్ని వివిధ పనులకు వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతంలోని రైతులు కంది, పత్తి, వరి, పెసర, మినుము పంటలను అధికంగా పండిస్తున్నారు. మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభిస్తే ఈ గోదాం రైతులకు ఉపయోగపడుతుంది. కొడంగల్ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ మధ్య కాలంలో 10 దుకాణాలు నిర్మించారు. వాటికి అద్దె నిర్ణయించి వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించారు.